క్లుప్తంగా

దివ్యాంగుడికి ఎలక్ట్రికల్ స్కూటర్ అందజేత



వినుకొండ(నూజెండ్ల): స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూజెండ్ల మండలం తలార్లపల్లి గ్రామానికి చెందిన ఏడుకొండలు అనే దివ్యాంగుడికి మూడు చక్రాల ఎలక్ట్రికల్ స్కూటర్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని, దివ్యాంగుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి నాయకులు పాల్గొన్నారు.

ఆర్మీ ర్యాలీ అభ్యర్థులకు వసతి ఏర్పాట్లు చేయాలి

అధికారులను ఆదేశించిన జేసీ

నరసరావుపేట ఈస్ట్: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరయ్యే అభ్యర్థులకు వసతుల కల్పనలో లోటుపాట్లు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు చివరి వారంలో జరగనున్న ఆర్మీ ర్యాలీకి వేలాదిగా అభ్యర్థులు తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ర్యాలీ జరగనున్న డీఎస్‌ఏ స్టేడియంతో పాటు అభ్యర్థుల వసతి నిమిత్తం సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల బాలుర వసతి గృహాన్ని శుక్రవారం అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శేషి రెడ్డి, తహసీల్దార్ రమణా నాయక్, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, హాస్టల్ వార్డెన్ మేజర్ బీఎస్‌ఆర్‌కె రాజు పాల్గొన్నారు.

దేవస్థానం అభివృద్ధికి రూ.10 లక్షలు విరాళం

వినుకొండ(నూజెండ్ల): పట్టణ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో వినుకొండ కొండపై వెలసిన రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణంలో భాగంగా అభివృద్ధి నిమిత్తం పట్టణ ప్రముఖ పారిశ్రామికవేత్త పెండేల వెంకట పుల్లారావు, వారి కుమారులు రూ.10 లక్షల 116 రూపాయలను సంఘం సభ్యులకు అందజేశారు. అనంతరం దాతలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ పులిపాటి రామారావు, సెక్రటరీ జాజుల మాల్యాద్రి, ట్రెజరర్ రెడ్డి నగేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ గంధం బాలిరెడ్డి, జాగర్లమూడి సుబ్బారావు, కందకట్ల అనంత కోటేశ్వరరావు, ములకా రామతులసి రెడ్డి, గజవల్లి నాగపవన్‌కుమార్, తేలికపల్లి బాబు, గోవిందునాయక్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాతులూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నరసరావుపేట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని సాతులూరు నుంచి నుదురుపాడు వెళ్లే మార్గంలో సుమారు 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ టి. సుబ్బారావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

విద్యార్థి అదృశ్యమయ్యాడంటూ..

నరసరావుపేట టౌన్: బీటెక్ విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్ఐ ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వైజాగ్, గాజువాక ప్రాంతానికి చెందిన పోతుల రాజేష్ ప్రకాష్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ జొన్నలగడ్డ శివారు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 7వ తేదీన హాస్టల్ నుంచి కాలేజ్‌కు అని వెళ్లిన రాజేష్ తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు విద్యార్థి తండ్రి రమణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో..

నరసరావుపేట టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితులు ఒక్కొక్కరికి రూ.2 వేల రూపాయల జరిమాన విధిస్తూ మొదటి అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ శుక్రవారం తీర్పు చెప్పారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వన్‌టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి జరిమాన విధించారు.

అభివృద్ధిలో ముందున్నాం

- నాడు–నేడు అనేలా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నాం
- ఈ ఏడాది చివరికల్లా బైపాస్
- కొండవీడుకు పర్యాటకుల సంఖ్య బాగా పెరిగింది
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- నియోజకవర్గ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, వేదికపై జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జేసీ శ్యామ్ ప్రసాద్

చిలకలూరిపేట: నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని తెలిపారు. చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నియోజకవర్గ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి రాజీలేకుండా పనిచేస్తున్నామని చెప్పారు. గతంలో చిలకలూరిపేట ఎలా ఉంది...? తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గం ఎలా ఉంది...అనే విషయాలను పరిశీలిస్తేనే తాము ఏ స్థాయిలో అభివృద్ధి చేశామో అర్థమైతుందన్నారు.

అతి త్వరలో అమృత్ ఫలాలు

పట్టణ ప్రజలకు అతి త్వరలో అమృత్ పథకం ఫలాలు అందజేస్తామని చెప్పారు. ఈ నెలాఖరులోగా అమృత్ పథకాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్ఎస్‌పీ కెనాల్ నుంచి మంచినీటి చెరువుకు వేస్తున్న పైపులైను పనుల్లో 29 కిలోమీటర్ల వరకు పెండింగ్ ఉందని, ఆ పనులు మినహా మిగిలిన అన్ని పనులు ఈ నెలాఖరులోగా పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఆ 29 కిలోమీటర్ల పైపులైను పనులు కూడా డిసెంబర్ నాటికి పూర్తి కావాలని ఆదేశించారు.

ఈ ఏడాది చివరికల్లా బైపాస్ ...

నియోజకవర్గానికి సంబంధించినంత వరకు మరో ముఖ్యమైన కార్యక్రమం బైపాస్ నిర్మాణమని చెప్పారు. పనులు వేగంగానే జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది చివరికల్లా ఈ పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. బైపాస్ నిర్మాణం పూర్తయితే చిలకలూరిపేట పట్టణంలోని ట్రాఫిక్ సమస్య సమసిపోతుందని తెలిపారు. జగనన్న లే అవుట్లలో పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు.

సీఎం హామీల అమలుపై చర్యలు తీసుకోండి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి వచ్చిన సమయంలో బీసీ, కాపు, ఎస్సీ భవన్‌ల నిర్మాణానికి హామీలు ఇచ్చారని, వెంటనే ఈ పనులను ప్రారంభించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వెంటనే శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

నాడు–నేడు పనులపై పూర్తి పర్యవేక్షణ...

నియోజకవర్గంలో నాడు–నేడు కింద ఆసుపత్రులు, పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. ఆసుపత్రుల అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయని చెప్పారు.

కొండవీడుకు కొత్త చరిత్ర

కొండవీడుకు కొత్త చరిత్రను జగనన్న రాస్తున్నారని తెలిపారు. కోట్లాది రూపాయాల నిధులు ఇస్తూ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ఆలయాల నిర్మాణం పూర్తయిందన్నారు. రోడ్లన్నీ వేశామని చెప్పారు. చెరువులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. పార్కింగ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. చిన్న పిల్లల కోసం ప్రత్యేక వసతులు సమకూర్చామని తెలిపారు. ఇంకా కోట్లాది రూపాయాల పనులు జరుగుతున్నాయని వివరించారు. గతంలో 400 నుంచి 500 మంది ప్రతి వారం కొండవీడును సందర్శించే వారని, ఇప్పుడు వారానికి సగటున ఎనిమిది వేల మంది కొండవీడును సందర్శిస్తున్నారని తెలిపారు.

ఆరుతడి పంటలపై ఆసక్తి చూపాలి

శావల్యాపురం: రైతులు ఆరుతడి పంటల సాగుకు ఆసక్తి చూపాలని ఏడీఏ బోయపాటి రవిబాబు కోరారు. శుక్రవారం మండలంలోని కనమర్లపూడి గ్రామం రైతుభరోసా కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ వర్షాభావం తక్కువగా నమోదైందని ఈక్రమంలో రైతులు ఆరుతడి పంటలైన కంది, మినుము, మిల్లెట్స్ తదితర పంటలను సాగు చేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించ వచ్చునన్నారు. అలాగే రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు కొరత లేదని, అర్హత కలిగి యున్న కౌలు రైతులందరు రైతుభరోసా కేంద్రాల ద్వారా సత్వరమే పంట సాగు ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు. ఈ పత్రాలు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతుభరోసా కేంద్రంలో ఎరువుల నిల్వలను పరిశీలించి రైతులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, వీఏఏ డి.స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

తల్ సైనిక్ క్యాంప్‌కు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థులు



తల్ సైనిక్ క్యాంప్‌కు ఎంపికైన విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల చెందిన ఐదుగురు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఈనెల 10వతేదీ నుంచి 19వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహిస్తున్న ఏపీ, తెలంగాణా రాష్ట్రాల ఎన్‌సీసీ ఇంటర్ గ్రూప్ ఛాంపియన్‌షిప్ (తల్ సైనిక్ క్యాంప్) పోటీలకు ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కె రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు కె.వెంకటేష్, ఎ.రామారావు (ఆబ్జికల్స్), డి.నిఖిలేశ్వర్, వి.సింధూర (ఫైరింగ్), ఎం.పవన్ కుమార్ (ఆరోగ్యం, పరిశుభ్రత) అంశాలలో పోటీ పడనున్నారని వివరించారు. విద్యార్థులను కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, అధ్యాపకులు అభినందించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

- 1325 సర్వీసులు తనిఖీ
- భారీగా అపరాధ రుసుం

బొల్లాపల్లి: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని డీపీఇ ఇఇ కె. సూర్యప్రకాష్, ఆపరేషన్ ఇఇ ఎస్. శ్రీనివాసరావులు అన్నారు. బండ్లమోటు సెక్షన్ పరిధిలో విజిలెన్స్ ఆపరేషన్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో 38 బృందాలుగా ఏర్పడి పలు గ్రామాల్లో విద్యుత్ చౌర్యంపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీటర్ లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యం మీటర్ ఉండి అక్రమంగా విద్యుత్ వినియోగం, అనుమతించిన కేటగిరిలో కాకుండా వేరే కేటగిరిలో విద్యుత్ వాడకం, లోడు కంటే అదనంగా కరెంటు వాడకం, తదితర సర్వీసులను గుర్తించి వారికి అపరాధ రుసుము విధించామన్నారు. వీటిలో 1325 సర్వీసులు తనిఖీ చేసి కరెంటు చౌర్యానికి పాల్పడుతున్న 145 మందికి రూ.4.09 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ చౌర్యం సర్వీసులు ఎల్లప్పుడు చట్టానికి లోబడే ఉంటాయన్నారు. తనిఖీల్లో విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ బియ్యం పట్టివేత

182 బ్యాగులు, రూ.3.45 లక్షల విలువైన రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

బొల్లాపల్లి: ప్రజాపంపిణీ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మండలంలోని వెల్లటూరు, సరికొండపాలెం, గుమ్మనంపాడు, బొల్లాపల్లి తదితర గ్రామాల్లో చౌకధరల దుకాణాలపై దాడులు నిర్వహించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ తహసీల్దార్ కె. నాగమల్లేశ్వరరావు, ఎస్ఐ ఎం. రామచంద్రారెడ్డి ఈ దాడుల్లో పాల్గొని మాట్లాడుతూ సమాచారం మేరకు మండలంలో దాడులు చేశామని, సుమారు సుమారు 182 బ్యాగుల్లో రూ.3.45 లక్షల విలువైన అక్రమ తరలింపు బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నామని తెలిపారు. తెల్లవారుజామున సరికొండపాలెం రోడ్డు వద్ద రెండు టాటా ఏస్ వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ రైస్‌ను స్వాధీనపరచుకున్నామని తెలిపారు. ఈ వాహనాల్లో సుమారు 137 గన్నీబ్యాగ్‌లు స్వాధీనపరచుకుని స్టేషన్‌కు తరలించామని తెలిపారు. వెల్లటూరు గ్రామంలో ఖజ్జాయం రామారావుకు చెందిన ఇంటిలో తెల్ల బ్యాగుల్లో నిల్వ ఉంచిన 45 టిక్కీలను స్వాధీన పరచుకున్నామని తెలిపారు. 45 టిక్కీలను స్వాధీనపరచుకుని గుంటి ఆంజనేయస్వామి రైస్ అండ్ ఫ్లోర్ మిల్ యజమాని ఖజ్జాయం లక్ష్మీనారాయణకు తగిన భద్రత నిమిత్తం అప్పగించామని తెలిపారు. స్వాధీన పరచుకున్న 137 గన్నీ బ్యాగులను ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని తెలిపారు.

రెండు సంఘటనలపై కేసు నమోదు చేశామని విచారణ చేపట్టామన్నారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వారిపై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తప్పవని అధికారులు తెలిపారు. దాడులు చేసిన వారిలో సీఎస్‌డీటి వై.లక్ష్మణరావు, సిబ్బంది రెహ్మాన్, పోలురాజు పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ



దొంగలు పగలగొట్టిన కిరాణా షాపు పైకప్పు రేకులు

నాదెండ్ల: కిరాణా దుకాణంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. బాధితుడు మూలె భాస్కరరెడ్డి కథనం ప్రకారం గణపవరం నుంచి వేలూరు వెళ్లే డొంక రోడ్డులో హన్విక‌రెడ్డి కిరాణ్ జనరల్ స్టోర్ నడుపుతున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో భార్యాభర్తలు ఇరువురూ షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం షాపును తెరివగా పై రేకుల కప్పు తొలగించి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. సుమారు రూ.7 వేల నగదు, కొన్ని కిరాణా సరుకులు చోరీకి గురయ్యాయి. దీనిపై నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు మద్యం తాగుతూ అర్ధరాత్రి సమయంలో చోరీ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

రెండు వార్డులు ఏకగ్రీవం

నాదెండ్ల: మూడు గ్రామాల్లో జరగనున్న పంచా యతీ వార్డు మెంబర్ల ఉప ఎన్నికల్లో రెండు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మండలంలోని అమీన్ సాహెబ్ పాలెంలో నిండుజర్ల ఆంజనేయులు, ఇర్లపాడు లో మంద్రు కన్యాకుమారి నామినేషన్ దాఖలు చేశారు. ఇరుస్థానాల్లో ఒక్కొక్కరే నామినేషన్లు వే యటంతో ఆయా స్థానాలు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. ఎండుగుంపాలెంలోనల్లబోతు ల కోటమ్మ, నల్లబోతుల మంగమ్మ ఇరువురూ నా మినేషన్లు దాఖలు చేశారు. వీరి నామినేషన్లను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నెల 14న ఉపసంహరణకు అవకాశం ఉంది. 19న ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకూ ఎన్నిక జరగనుంది.

13న మెగా ఉచిత కంటి వైద్యశిబిరం

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ నెల 13న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నాదెండ్ల సొసైటీ చైర్మన్, కేవీఆర్ ఫౌండేషన్ అధినేత కురుకుంట్ల వెంకట రెడ్డి చెప్పారు. శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతుందన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారన్నారు.

షాపులకు వేలం పాట

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గుడ్‌విల్ పద్ధతిపై నూతనంగా నిర్మిస్తున్న కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ షాపులకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.వెంకయ్య మాట్లాడుతూ బ్లాక్ నెం.7లో షాపు నెం. 9కు రూ.12.91 లక్షలు, షాపు నెం.23 రూ. 12.69లక్షలు, 24కు రూ.12.68 లక్షలు, బ్లాక్ నెం. 8లో గల షాపు నెం. 21కి రూ.14.34 లక్షలు, బ్లాక్ నెం. 9లోని షాపు నెం. 2కు రూ.14.35లక్షలు, షాపు నెం. 3కి రూ.14.36 లక్షలు, షాపు నెం. 21కు రూ.14.34 లక్షలకు మద్దతు ధర కంటే ఎక్కువగా పాడినట్లు తెలిపారు. అకాల వర్షం కారణంగా మిగిలిన షాపులకు ఈ నెల 14వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, కౌన్సిలర్లు షేక్ షకీలా, పాపసాని బ్రహ్మయ్య, మేనేజర్ కె. శ్రీనివాసరావు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్, రెవెన్ ఇన్‌స్పెక్టర్ కె.మణికంత కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.చెన్నకేశవులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఈపూరు: మండలంలోని ఊడిజర్ల, ముప్పాళ్ల, కొచ్చర్ల, ఈపూరు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ బి. వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లతో పాటు 33 కేవీ లైన్ల మరమ్మతులు కూడా నిర్వహిస్తామన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: పట్టణ సబ్‌డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల దృష్ట్యా నేటి ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్ కుమార్ చెప్పారు. తాతపూడి, రామచంద్రాపురం, మురికిపూడి, పసుమర్రు, గొట్టిపాడు, మిట్టపాలెం, నాగబైరువారిపాలెం, కొత్తపాలెం, మానుకొండవారిపాలెం, దండమూడి, తాతపూడి, గోపాళవారిపాలెం, కట్టుబడివారిపాలెం, పోతవరం, రాజాపేట గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మాతృభూమి రుణం తీర్చుకోవాలి

జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్



రిటైర్డ్ ఆర్మీ అధికారులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

చిలకలూరిపేట: ప్రతి ఒక్కరూ మాతృభూమి రుణం తీర్చుకోవాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా నాభూమి–నా దేశం కార్యక్రమం శుక్రవారం చిలకలూరిపేట పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా పురపాలక సంఘ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేస్తూ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిక్షణం మాతృభూమి కోసం జీవించటమే స్వాతంత్ర్య సమరయోధులకు మనం అర్పించే నివాళి అని చెప్పారు. నామట్టి– నాదేశం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రిటైర్ ఆర్మీ అధికారులు షేక్ అబ్దుల్ రహీం, మంత్రునాయక్, షేక్ అబ్దుల్ రజాక్, బి.సత్యనారాయణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎమ్మెల్యే తనిఖీలు

- మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసిన వైనం
- మంచినీటి సరఫరా నిలిచిపోవడంపై ఆగ్రహం
- పునరుద్ధరించిన మునిసిపల్ సిబ్బంది



స్వీపర్లను హెచ్చరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: 'పిల్లలు భోజనం చేసే సమయంలో ఉపాధ్యాయులు అందరూ దగ్గర ఉండాలి.. ఇవాళ వడ్డిస్తున్న కూర బాగానే ఉంది.. అయితే అన్నమే బాగో లేదు' అంటూ సూచించారు శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి. పట్టణంలోని స్థానిక మహాత్మా గాంధీ పురపాలక సంఘం బాలుర ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల తరగతి గదులు, వంటశాల, భోజనశాల, బాత్ రూమ్, మరుగుదొడ్లు పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యుత్ స్విచ్‌లు వేసి లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా పని చేస్తున్నాయో లేదో పరిశీలించారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సింకులు, మంచినీటి ఆర్‌ఓ ప్లాంట్‌ల వద్ద పరిశుభ్రత లోపించటంపై ఎమ్మెల్యే పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్, సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు లేకుండా భోజనాలు ఏవిధంగా చేస్తారని ప్రశ్నించారు. తాగునీరు రాకపోతే అధికారుల దృష్టికి తీసుకురాకుండా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు సౌకర్యాలను పరిశీలించాల్సిన అవసరం మీకు ఉందని ఎమ్మీవోకు సూచించారు. సౌకర్యాలను పకడ్బందీగా నిర్వహించకపోతే మెమో ఇప్పించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అపరిశుభ్రంగా ఉన్న మధ్యాహ్న భోజనం చేసే షెడ్డును పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేయని ఆయాలు, స్వీపర్లను తొలగించి కొత్తవారిని పెట్టుకోవాలని సూచించారు. పాఠశాలకు కావల్సిన వసతులను తక్షణమే ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.. జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, పాదిలే ఖాజా, కాకుమాను కోటిరెడ్డి, రోటరీక్లబ్ ప్రతినిధులు తాళ్ల రాజశేఖరరెడ్డి, జమ్ముల రాధాకృష్ణ, విద్యాశాఖ అధికారులు, మున్సిపల్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మెల్యే సూచనపై మున్సిపల్ డీఇ శ్రీనివాసరావు, ఏఈ శ్రీరాములు నాయక్ హుటాహుటిన ఫిటర్‌తో కలిసి స్కూలుకు చేరుకున్నారు. నీటి కుళాయిలు, వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు.

ఉత్సాహంగా నా భూమి – నా దేశం కార్యక్రమం



ఎండుగుంపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



శిలాఫలక అవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నాదెండ్ల: మండలంలోని మూడు గ్రామాల్లో నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. కనపర్రులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కాంతారావు, ఎండుగుంపాలెంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, నాయకులు, బుక్కాపురంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ సాంబశివరావు, నాయకులు హాజరయ్యారు. ముందుగా స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించారు. స్కూల్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): ఆజాదీకాఅమృత్ మహోత్సవ్‌లో భాగంగా వినుకొండ మున్సిపాలిటీ కమిషనర్ పి.వెంకయ్య ఆధ్వర్యంలో నరసరావుపేట రోడ్డులోని ఎన్ఎస్‌పీ కాలువ కట్ట వద్ద నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. అమరవీరుల అమృత వాటిక నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పట్టణంలోని పలు ప్రదేశాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాజీ సైనికులను సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, పురపాలక, మెప్మా అధికారులు, సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

నూజెండ్ల మండలంలో....

వినుకొండ (నూజెండ్ల): నా భూమి– నా దేశం కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని కొత్త జడ్డవారిపాలెం, పాత జడ్డవారిపాలెం, మారెళ్లవారిపాలెం, ఐనవోలు, పెద్దవరం తదితర గ్రామాల్లో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, ఇర్లపాడు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో మన భూమి–మన దేశం కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేల్పూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఎంపీపీ ముండ్లమూరి అనిల్‌కుమార్ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు రంతు శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు పూర్తి చేయాలి

చిలకలూరిపేటటౌన్: ఈ పంట నమోదులో నూతనంగా ఈ సంవత్సం నుంచి జియో పెన్సింగ్ విధానం అమలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. శుక్రవారం మండలంలోని కావూరు గ్రామంలో ఆర్‌బీకె కార్యాలయంలో పంట నమోదు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఏఏలు అందరు నిర్ణీత సమయం లోపు ఖచ్చితంగా ఈ పంట నమోదు ను పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారి జీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

20న జిల్లా హేతువాద మహాసభ

చిలకలూరిపేటటౌన్: జిల్లా హేతువాద సంఘ ప్రథమ మహాసభ, అధ్యయన తరగతులు ఈ నెల 20 తేదీ నిర్వహించనున్నట్లు సంఘ కన్వీనర్ షేక్ చిన మస్తాన్ చెప్పారు. సభలు ఆర్‌వీఎస్‌సీవీ ఎస్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

కోడిపందేల కేసులో జరిమానా

మండలంలోని అల్లూరివారిపాలెం గ్రామంలో కోడిపందేల స్థావరంపై ఈ నెల 6వ తేదీన నరసరావుపేట రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ 14 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.27 వేల నగదు, 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరచగా నేరాన్ని అంగీకరించారు. దీంతో న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.50 రూపాయల జరిమాన విధించారు.